క్లుప్తంగా

దర్గాలో భక్తుల సందడి



దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలను, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్ని సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

పాఠశాలల విలీనం తగదు

మంత్రాలయం రూరల్ : పాఠశాలల అప్‌గ్రేడ్ పేరుతో ప్రభుత్వం చేపడుతున్న పాఠశాలల విలీనం విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాఠశాలల విలీనాన్ని నిరసిస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల విలీనంతో ఎంతో మంది చిన్నారులు ఇబ్బందులు గురవుతున్నారన్నారు. స్థానిక రామచంద్ర నగర్ ఎంపీపీ పాఠశాలను యథావిధిగా కొనసాగించాలని కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు జూనియర్ కళాశాలను అటాచ్ చేయడం సరికాదన్నారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ రమాదేవికి అందజేశారు. ఆందోళనలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు అరుణాచార్, కార్యదర్శి దివాకర్, కోశాధికారి వీరేష్, సభ్యుడు నవీన్ తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ అందజేయాలి

మంత్రాలయం రూరల్ : వృద్ధులకు కచ్చితంగా ఇంటి వద్దకే వెళ్లి డీలర్లు రేషన్ సరుకులు అందజేయాలని తహసీల్దార్ రమాదేవి ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలో డీలర్లతో సమావేశం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రతి నెలా 26 నుంచి 30వ తేదీ వరకు వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి సరుకులు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ గురురాజారావు, ఆయా గ్రామాల డీలర్లు పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శిగా చంద్రమోహన్

ఆదోని అర్బన్: ఆదోని నియోజకవర్గం ఏపీడబ్ల్యూజేఎఫ్ పట్టణ గౌరవాధ్యక్షులు నాగరాజు, బసవరాజు ఆధ్వర్యంలో సంఘం ప్రధాన కార్యదర్శిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక కార్యాలయంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శిగా చంద్రమోహన్‌ను కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతకుముందు మునెప్ప ఈ స్థానంలో ఉండగా, అనివార్యకారణాల వల్ల ఆయన బయటికి వెళ్లారు. దీంతో ఆ స్థానంలో చంద్రమోహన్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు ఉరుకుందప్ప, విజయ్, కార్యవర్గ సభ్యులు భీమా, రమేష్‌రెడ్డి, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకుల రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలి



రాఘవేంద్రసర్కిల్‌లో ఆందోళన చేస్తున్నవాల్మీకులు

మంత్రాలయం : వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్‌ను ప్రభుత్వం పునరుద్ధరించాలని బోయ వాల్మీకి సమితి రాష్ట్ర అధ్యక్షుడు అంజి, ప్రధాన కార్యదర్శి శేఖర్‌నాయుడు డిమాండ్ చేశారు. గురువారం బీవీఎస్ ఆధ్వర్యంలో మంత్రాలయంలో ఆందోళన చేపట్టారు. స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టి అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఆయన మాట్లాడుతూ 1952కు ముందు రాష్ట్రంలోని బోయలంతా ఎస్టీలుగా ఉన్నారని గుర్తు చేశారు. ఇప్పటికీ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల్లో బోయలు ఎస్టీ జాబితాలోనే ఉన్నారని వివరించారు. రాయలసీమ ప్రాంత బోయలను ఎస్టీలుగా పునరుద్ధరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. అనంతరం డిమాండ్ల పత్రాన్ని తహసీల్దార్ రమాదేవికి అందజేశారు. ఆందోళనలో నాయకులు ఈరన్న, మహేంద్రనాయుడు, వీవీ నాయుడు, శివరాముడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం రామన్నగౌడ్

ఎమ్మిగనూరుటౌన్:ప్రజల సమస్యలపై ఎనలేని పోరాటాలు చేసిన ఉద్యమ కెరటం రామన్న గౌడ్ అని ఏపీ రైతు కూలీ సంఘం, ఐఎఫ్‌టీయూ నాయకులు ఏసేపు, ఆనీఫ్ అన్నారు. సీపీఐ ఎంఎల్ నాయకుడు రామన్న గౌడ్ ఆరవ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా దైవందిన్నె గ్రామంలో రామన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పీవైఎల్ ఆధ్వర్యంలో ఆసంఘ నాయకులు నివాళులర్పించారు.

కరుణించని వరుణుడు

- 20 రోజులుగా కురవని వర్షాలు
- మొలకెత్తని పత్తి విత్తనాలు
- పంపులతో నీటిని పిచికారీ చేస్తున్న రైతులు
- రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురవక పోతే కష్టమే



పత్తి మొలకలకు నీటిని పిచికారీ చేస్తున్న రైతు బంద



గోనెగండ్ల సమీపంలో సాగుచేసిన పత్తి పైరు

గోనెగండ్ల: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే తెలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిశాయి. దీంతో రైతన్నలు ముందస్తుగా పంటలను సాగు చేశారు. అయితే వర్షాలు సకాలంలో కురువకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి. గత 20 రోజులుగా వరుణ దేవుడు కరుణించకపోవడంతో పత్తి విత్తనాలు మొలకెత్తలేదు. కొన్ని చోట్ల మొలకెత్తినా నీళ్లలేక ఎండుముఖం పట్టాయి. దీంతో రైతులు పంపుతో నీటిని పిచికారీ చేస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురవకపోతే పత్తి విత్తనాలు పూర్తి స్థాయిలో మొలకెత్తవని ఆందోళన చెందుతున్నారు.

15 వేల ఎకరాల్లో పత్తి సాగు..

మండలంలో గోనెగండ్ల, బైలుప్పల, పుట్టపాశం, హెచ్. కై రవాడి, కన్నూరు, పెద్దనేలటూర్, పెద్దమరివీడు తదితర గ్రామాల్లో అధికంగా పత్తి పంటను సాగుచేశారు. మండలంలో దాదాపు 15వేల ఎకరాల్లో పత్తి విత్తనాలను వేశారు. గత 20 రోజులుగా వర్షాల కురవకపోవడం, ఈదురు గాలులు, ఎండవేడిమి పెరగటం వల్ల భూమిలో తేమ ఆరిపోయి విత్తనం మొలకెత్తలేక పోతుందని రైతులు తెలుపుతున్నారు. కొన్ని చోట్ల మొలకెత్తినా ఎదుగుదల లోపించింది.

కష్టపడి నీటి తడులు

కొందరు రైతులు బోరు బావులు ఉన్న రైతుల దగ్గర నుంచి నీటిని విడిపించుకొని పత్తి పంటకు నీళ్లు పెడుతున్నారు. మరికొందరు వాటర్ ట్యాంకర్లతో నీటిని పొలానికి తీసుకువచ్చి పంటకు పోస్తూ కాపాడుకునేందుకు యత్నిస్తున్నారు. మరి కొందరు విత్తనాలు మొలకెత్తేందుకు స్ప్రేయర్లతో నీటిని పిచికారీ చేస్తున్నారు.

ఇప్పటికి రూ.40వేలు ఖర్చు చేశా

నాలుగు ఎకరాల్లో పత్తిని సాగుచేశాను. ఇప్పటి వరకు విత్తనాలు విత్తిన నాటి నుంచి వర్షం కురియకపోవడంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో పిచికారీ చేసే పంపుతో నీటిని పత్తి విత్తనాలకు నీటి పిచికారీ చేసున్నా. పత్తి సాగు చేసేందుకు విత్తనాలు, కూలీలు ఖర్చులకు మొత్తం పెట్టుబడి దాదాపు రూ.40వేలు ఖర్చు చేసినట్లు చెప్పాడు.

– బంద, రైతు, గోనెగండ్ల

యూరియా పిచికారీ చేయాలి

బెట్ట పరిస్థితుల్లో పత్తి పంటను కాపాడుకోవడానికి రైతులు ఒక లీటర్ నీటికి 20 గ్రాముల యూరియా కలుపుకొని ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల పంటలను వర్షం వచ్చే వరకు కాపాడుకోవచ్చు.

– హేమలత, ఏఓ, గోనెగండ్ల

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు



ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే, డీఎస్పీ, సబ్‌కలెక్టర్, విద్యార్థులు, అధికారులు

ఆదోని రూరల్: మాదక ద్రవ్యాల జోలికెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఎస్పీ హేమలత అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ గ్రౌండ్‌లో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్ పాఠశాల నుంచి ఏరియా ఆసుపత్రి మీదుగా పి.ఎస్.రోడ్ కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. పీఎస్‌రోడ్డు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిసలు కావొద్దన్నారు. యువకులు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీసుశాఖ, మున్సిపల్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో నాశనం కావొద్దు

మంత్రాలయం రూరల్ : యువత మాదక ద్రవ్యలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని టీడీపీ మంత్రాలయ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సీఐ రామాంజులు నేతృత్వంలో అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్ నుంచి రాఘవేంద్ర స్వామి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ గురురాజరావు, ఎస్ఐ శివాంజల్, మాధవరం ఎస్ఐ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి : కోసిగిలో సీఐ మంజునాథ్, ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి ఆధ్వర్యంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులచే పురువీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా నిలబడి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పెద్దకడబూరు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐలు కార్తీక్‌సాగర్, నాగేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా గురువారం పట్టణంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి, డీఎస్పీ ఉపేంద్రబాబు పాల్గొన్నాని మాట్లాడారు. అనంతరం మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి, పట్టణ సీఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యువత తప్పుదోవ పట్టొద్దు

ఆదోని సెంట్రల్: విద్యార్థులు, యువతీ యువకులు తప్పుదోవ పట్టొద్దని బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఆదోని రెండవ అడిషనల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ శ్రీవల్లి సూచించారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పట్టణంలోని నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మొక్కలను నాటి నీరు పోశారు. జడ్జి మాట్లాడుతూ యువకులు చిన్నతనంలోనే మాదక ద్రవ్యాలకు, డ్రగ్స్, మద్యానికి బానిసలవుతున్నారన్నారు. దీంతో కుటుంబాలు ఇబ్బంది పడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్‌బాషా, సౌజన్య, ప్రీతి, సోని, దినకర్, ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సలోమి, డాక్టర్ ఖాలిక్, విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి సెల్ఫీ దిగుతున్న జడ్జి శ్రీవల్లి

సూక్ష్మ సేద్యం ఉపయోగకరం



మాట్లాడుతున్న ఏపీడీ ఫిరోజ్‌ఖాన్

ఎమ్మిగనూరుటౌన్: సూక్ష్మ సేద్యంతో రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయని, ప్రభుత్వం సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేస్తుందని ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. మండల పరిధిలోని బనవాసి కేవీకేలో బిందు సేద్యం వాటి విధి విధానాలపై ఆదోని క్లస్టర్ ఏరియా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2025–2026 సంవత్సరానికి గాను 7వేల హెక్టార్లలో బిందు సేద్య లక్ష్యం వుందన్నారు. గతంలో కంటే సూక్ష్మ సేద్య పరికరాలకు ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఆయా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంఐ ఇంజినీర్ హనుమన్న, హెచ్‌ఓలు శ్రీవాణి, అపర్ణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రంలోని మంచాల గ్రామంలో ఉపాధి పనుల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణపై ఏపీడీ లోకేశ్వర్ విచారణ చేపట్టారు. గురువారం గ్రామంలోని సీఎస్ఐ చర్చి వద్ద ఉపాధి కూలీలను విచారించారు. ఆయన మాట్లాడుతూ..17వ సామాజిక తనిఖీల్లో ఉపాధి పనుల్లో అవినీతి ఆరోపణల మేరకు విచారణ చేపట్టినట్లు వివరించారు. ఉపాధి కూలీల్లో ముగ్గురు జాబ్ కార్డు కూలీలతో నివేదికలు తీసుకున్నామని చెప్పారు. అందులో ఉపాధి కూలీలు పనులకు వెళ్లామని, పని చేశామని ఏపీడీ కూలీలు అందరి సమక్షంలో తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ భక్తవత్సలం, క్లస్టర్ టీఏ గిడ్డయ్య, టీఏ లక్ష్మన్న పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని తరిమికొడదాం

ఆదోని టౌన్: క్షయ వ్యాధిని పూర్తి స్థాయిలో తరిమి కొడదామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని మహాయోగి లక్ష్మమ్మవ్వ కాలనీలో టీబీ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, గళ్లలో తెమడ మరియు రక్తం పడడం, ఛాతీలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శరీరంలో ఇతర భాగాల్లో వాపు, కణితలు తదితర లక్షణాల్లో ఏ ఒక్కటి ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాముడు, మేరి, అరుణ, సుబ్బమ్మబాయి తదితరులు పాల్గొన్నారు.

బూత్‌ల విభజనపై అభిప్రాయాలు తెలపండి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్

ఆదోని రూరల్: బూత్‌ల విభజనపై రాజకీయ నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేయాలని తహసీల్దార్ రమేష్ కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఒక బూత్‌లో 1,200 మందికి పైగా ఓటర్లు ఉంటే అక్కడ రెండు బూత్‌లను ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్ నుంచి ఆదేశాలు ఉన్నాయన్నారు. ఇందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఏవైనా సలహాలు, సూచనలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఆదోని నియోజకవర్గంలో మొత్తం 1,200 బూత్‌లు ఉండగా, ఇందులో 67 బూత్‌ల్లో 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని, ఆదోని రూరల్‌లో 12, పట్టణంలో 55 బూత్‌లు ఉన్నాయన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, బీజేపీ నాయకులు నాగరాజుగౌడ్, జనసేన పార్టీ నాయకులు రాకేష్, సీపీఎం నాయకులు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ముదిరిన మోడల్ స్కూల్ సీట్ల వివాదం

- మెరిట్ విద్యార్థికి సీటు ఇవ్వకపోవడంపై ఎస్ఎంసీ చైర్మన్, విద్యార్థి సంఘాల ఆగ్రహం
- ప్రిన్సిపాల్‌తో వాగ్వాదం
- రాజీనామాకు సిద్ధమైన ఎస్ఎంసీ చైర్మన్ గౌస్



పాఠశాల ప్రిన్సిపాల్, చైర్మన్ మధ్య వాగ్వాదం జరుతుగున్న దృశ్యం

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో సీట్ల కేటాయింపు వివాదం ముదురుతోంది. ఈ విషయంపై గురువారం స్కూల్ ప్రిన్సిపాల్ షాహీనా పర్వీన్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గౌస్ మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో చైర్మన్ రాజీనామాకు సిద్ధపడ్డారు. మోడల్ స్కూల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తున్నారని చైర్మన్ ఆరోపించారు. 6, 7, 8, 9 తరగతులకు మెరిట్ ప్రకారం విద్యార్థులను ఎంపిక చేయకుండా ఇష్టానుసారం తక్కువ మార్కులు వచ్చిన వారిని ఎలా ఎంపిక చేశారని, ఇంటర్ అడ్మిషన్లలో కూడా ఇలాగే ఉన్నారని చైర్మన్ ప్రశ్నించారు. తాను మాత్రం నియమ నిబంధనల ప్రకారమే ఎంపిక చేశానని ప్రిన్సిపాల్ వాదించారు. గోనెగండ్లకు చెందిన మంజునాథ్ అనే విద్యార్థి ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో 66 మార్కులు వచ్చాయి. ఆ విద్యార్థిని కాదని తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థికి ఎట్లా సీటు కేటాయించారని ప్రశ్నించారు. పాఠశాల నిర్వహణలో చైర్మన్ జోక్యం చేసుకోరాదని ప్రిన్సిపాల్ అనడంతో మెరిట్ విద్యార్థులకు కూడా న్యాయంగా సీట్ ఇవ్వలేని స్థితిలో పాఠశాల చైర్మన్‌గా ఉండేకంటే రాజీనామా చేసి వెళ్తానని చైర్మన్ గౌస్ అన్నారు. పాఠశాలలో జరుగుతున్న అక్రమాలను గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం

ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో మెరిట్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాఘునాథ్, ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిస్వామి తెలిపారు. గురువారం ఆ సంఘాల నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ఏపీ మోడల్ స్కూల్‌ను ముట్టడించారు. సీట్ల కేటాయింపు విషయంలో ప్రిన్సిపాల్‌తో వాగ్వాదానికి దిగారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపి ఆమెను విధుల నుంచి తొలగించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీటు ఇప్పించి న్యాయం చేయండి

మోడల్ స్కూల్‌లో తన కుమారుడు మంజునాథ్‌కు సీటు ఇప్పించి న్యాయం చేయాలని విద్యార్థి తండ్రి మల్లికార్జున అధికారులను కోరారు. మండల కేంద్రం గోనెగండ్లకు చెందిన బోయ మల్లికార్జునకు భార్య సరస్వతికు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మల్లికార్జున ఆటో నడుపుతూ పిల్లలను చదివిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన చిన్న కుమారుడు మంజునాథ్‌కు ప్రవేశ పరీక్షలో 66 మార్కులు వచ్చినా తన కుమారుడికి సీటు ఇవ్వకుండా తక్కువ మార్కులు వచ్చిన వారికి కేటాయించడంపై మల్లికార్జున గురువారం పాఠశాలకు వెళ్లి ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించాడు. అయితే మీకు లేదు వేరే వాళ్లకు సీటు ఇవ్వడం జరిగిందని ప్రిన్సిపాల్ సమాధానమిచ్చారని తెలిపాడు. సీట్లు అయిపోయాయి మేము ఏమీ చేయలేమని నిర్లక్ష్యం చెబుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

వేలం వాయిదా వేయాలి

ఆదోని టౌన్:పట్టణంలో మున్సిపల్ షాపుల వేలం వా యిదా వేయాలని ఆదోని ఎంహెచ్‌పీ సమితి రాష్ట్ర కా ర్యదర్శి నూర్‌అహ్మద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైల్వేస్టేషన్ రోడ్డు, సట్టా బజారులో ఉన్న 37 మున్సిపల్ షాపుల వేలం చడీచప్పుడుగాకుండా పెద్దగా ప్రచారం లేకుండా వేలం వేయడంతో కొందరికి లబ్ధి చేకూరేవిధంగా ఉందన్నారు. దీనిపై మున్సిపల్ ఆర్‌జేడీకి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

అన్నదాత సుఖీభవ అమలు చేయాలి

నందవరం : కూటమి ప్రభుత్వం రైతులకు వెంటనే అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్నగౌడ్, సోమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం నందవరంతో పాటు రాయచోటి గ్రామంలో సీపీఐ నాయకులు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులకు చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందించాలన్నారు. గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల కింద రిజర్వాయర్లలోని పంపుహౌస్‌లు, ఎల్లెల్సీ కాలువలు మరమ్మతులు చేసి, రైతులకు సాగు నీరు, గ్రామాల్లో తాగు నీరు అందించేలా ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గిడ్డయ్య, శాంతన్న, రాముడు, రంగన్న, నాగరాజు, ఈరన్న, రామలింగడు, ముని, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కౌన్సిల్ సమావేశం

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి గురువారం తెలిపారు. సభ్యులందరూ తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

మంచినీటి ట్యాంక్ ఎక్కి కార్మికుల నిరసన



ఎమ్మిగనూరుటౌన్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండటంపై గురువారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి పార్క్ వద్ద ఉన్న మంచినీటి ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపారు. యూనియన్ నాయకులు నారాయణ, రాజేంద్రలు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో టెక్నికల్ కార్మికులకు రూ.29,200లు, నాన్‌టెక్నికల్ కార్మికులకు రూ.24,500లు నెలసరి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జాతీయ సెలవులతో పాటు ఆదివారం సెలవులను కార్మికులను వర్తింపజేయాలని కోరారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



నర్సిరెడ్డి మృతదేహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి

పెద్దకడబూరు : కార్యకర్తల కుటుంబాలకు తమ కుటుంబం అన్ని విధాలుగా అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాపులదొడ్డి గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త మురవణి నర్సిరెడ్డి(61) బుధవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వై.ప్రదీప్‌రెడ్డి గురువారం బాపులదొడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందన్నారు. ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలి



ర్యాలీలో పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య

పెద్దకడబూరు : రైతుల ఆత్మహత్యల నివారణకు స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సీపీఐ 8వ మండల మహాసభలను మండల కార్యదర్శి వీరేష్ అధ్యక్షతన నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి చంద్రమ్మ భవనం వరకు ర్యాలీ నిర్వహించి సీనియర్ నాయకులు ఇస్మాయిల్ చేత పార్టీ జెండాను అవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు బ్యాంక్ రుణాలు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతుల ఆత్మహత్యలను అరికట్టాలన్నారు. మోదీ ప్రభుత్వం దేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు కుట్ర పన్నుతుందని విమర్శించారు. లౌకిక దేశంగా ఉండేలా కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే పశ్చిమ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న ఆర్‌డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల, వేదావతి, హంద్రీనీవా ప్రాజెక్టులను పూర్తిచేసి ప్రజలకు తాగు, సాగునీరు అందిస్తామని చెప్పి మాట తప్పారని మండిపడ్డారు. దీంతో ప్రజలు వలస వెళ్లతున్నారన్నారు. అనంతరం సీపీఐ మండల నూతన కార్యదర్శులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు మునెప్ప, భాస్కర్‌యాదవ్, ఆంజనేయ, తిమ్మయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పురుగుల నివారణ



ఎర్రకోటలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

ఎమ్మిగనూరుటౌన్: పత్తి పంట సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే పంటపై ఆశించే పురుగులను నివారించవచ్చని ఏడీఏ ఎస్. మహమ్మద్‌ఖాద్రీ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎర్రకోట గ్రామంలో పత్తి పంటను ఏఓ శివశంకర్‌తో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంటపై పేనుబంక, దోమ ఆశించిందన్నారు. ఈ రసం పీల్చే పురుగుల నివారణకు ప్రొఫినోపాస్ 2 ఎంఎల్ లీటర్ నీటికి లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలుపుకొని ఆకులు బాగా తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రస్తుతం బెట్ట పరిస్థితుల్లో 19:19:19ను 5 గ్రాములు లీటర్ నీటిని కలుపుకొని పంటలపై పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నరసింహుడులు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి



ముగతి మోడల్ స్కూల్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

నందవరం : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. గురువారం మండల పరిధిలోని ముగతి గ్రామంలో మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలు, మహిళల రక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, మత్తు పదార్థాల వినియోగంతో దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలను నాశనం చేసుకోవద్దని వివరించారు. అలాగే చిన్న పిల్లలకు వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తే శిక్షర్హులవుతారని వివరించారు. సైబర్ క్రైమ్‌లో ఎన్నో రకాల నేరాలు ఉన్నాయని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కేశవ, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.